క్లుప్తంగా

రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్

చిట్యాల : పట్టణంలోని సీఐ కార్యాలయంలో శుక్రవారం చిట్యాల, నార్కట్‌పల్లి మండలాలకు చెందిన పలువురు రౌడీషీటర్లకు నార్కట్‌పల్లి సీఐ మహేష్ కౌన్సిలింగ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పాత నేరస్తులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి వివాదాల్లో పాల్గొనకూడదని, గ్రామాల్లో పంచాయతీలు చెప్పొద్దని సూచించారు.

బేడ బుడిగ జంగం జిల్లా కార్యదర్శిగా శంకర్



కట్టంగూర్ : బేడ బుడిగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శిగా కట్టంగూర్‌కు చెందిన సిరిశాల శంకర్‌ను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిరిగిరి మన్నెం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ బేడ బుడిగ జంగాల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

మిషన్ ఇంద్రధనస్సుపై అవగాహన

కనగల్ : చిన్నారులందరికీ వ్యాక్సిన్ వేసేలా చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ కత్తుల వరూధిని సిబ్బందికి సూచించారు. శుక్రవారం కనగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంపై వైద్య సిబ్బందికి ఆమె అవగాహన కల్పించారు. ఆగష్టు 7నుంచి అక్టోబర్ వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

మాజీ జెడ్పీటీసీ మృతి



యాదమ్మ(ఫైల్)

నకిరేకల్ : నకిరేకల్ మండల మాజీ జెడ్పీటీసీ, రిటైర్డు ఉపాధ్యాయురాలు పందిరి యాదమ్మ (74) అనారోగ్యంతో శుక్రవారం సాయంత్రం కన్నుమూశారు. నకిరేకల్ మండలం కడపర్తి గ్రామానికి చెందిన యాదమ్మ, ఉపాధ్యాయురాలిగా పనిచేసి 2006లో రిటైర్డు అయ్యారు. యూటీఎఫ్ పూర్వ జిల్లా మహిళా విభాగం కార్యదర్శిగా పనిచేశారు. నకిరేకల్‌లోని నివాసం ఉంటున్నారు. సీపీఎం తరఫున 2008లో పోటీచేసి నకిరేకల్ జెడ్పీటీసీగా పనిచేశారు. భర్త వెంకటనర్సు కూడా రిటైర్డు ఉపాధ్యాయుడు. ఆయన గతంలో అనారోగ్యంతో మృతి చెందారు. యాదమ్మకు ఇద్దరు కుమారులు. యాదమ్మ అంత్యక్రియలు శనివారం నకిరేకల్‌లో జరగనున్నాయి.

ఆర్థికసాయం అందజేత

మునుగోడు : మండల కేంద్రానికి చెందిన నిరుపేద మహిళ గంజి నర్సమ్మ అనారోగ్యానికి గురై వైద్య చికిత్స పొందేందుకు ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతోంది. విషయం తెలుసుకున్న మునుగోడు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి శుక్రవారం రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని స్థానిక బీజేపీ నాయకుల ద్వారా నర్సమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పందుల భాస్కర్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ అన్వర్, పాల్వాయి జితేందర్ రెడ్డి, సంపత్, గిరి, సుదర్శన్, వెంకన్న, రాజు, యాదయ్య, ప్రకాష్, సైదులు, పవన్ పాల్గొన్నారు.

కేతేపల్లి : మండలంలోని కొత్తపేట గ్రామంలో ఇటీవల మృతిచెందిన కందికంటి ముత్తయ్య, కందికంటి రాజశేఖర్ కుటుంబాలను శుక్రవారం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పరామర్శించారు. ముత్తయ్య కుటుంబానికి రూ.20 వేలు, రాజశేఖర్ కుటుంబానికి రూ.15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ బచ్చు జానకిరాములు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి, కానుగు యాదగిరి, ఆర్.సైదులు, ఊర యాదగిరి, దాసరి లింగయ్య తదితరులు ఉన్నారు.

రుణమాఫీ చేయాలి

చిట్యాల : రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ ఏకకాలంలో చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఐతరాజు నర్సింహ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరెగూడెం గ్రామంలో శుక్రవారం జరిగిన రైతు సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వర్షకాలంలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను సబ్సిడీపై పంపిణీ చేయాలని కోరారు. లడే శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో లడే రాములు, నంద్యాల శ్రీనివాస్, బి.భాస్కర్, దొడ్డి మీనయ్య, పెరుమాళ్ళ మారయ్య, జోగు నాగరాజు, మురాల అంజయ్య పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఉన్న భవనాల కూల్చివేత



అక్కచెల్మ ప్రాంతంలో శిథిలావస్థలో ఉన్న భవనాన్ని కూల్చివేయిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

నల్లగొండ : పట్టణంలో శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉన్న భవనాలపై శుక్రవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి నల్లగొండ మున్సిపాలిటీ అధికారులు స్పందించారు. పట్టణంలోని పాతబస్తీ, అక్కచెల్మ, ఇస్లాంపుర ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న పురాతన భవనాలను జేసీబీతో మున్సిపల్ అధికారులు కూల్చివేశారు.

రేషన్‌లో అన్ని సరుకులు ఏవీ ?

- రేషన్ దుకాణాల్లో బియ్యం మాత్రమే పంపిణీ
- మార్కెట్‌లో భారీగా పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు
- సబ్సిడీపై ఇవ్వాలంటున్న ప్రజలు



రేగట్టె రేషన్ దుకాణంలో బియ్యం తీసుకుంటున్న మహిళ

కనగల్ : మార్కెట్‌లో ఏ వస్తువు కొనాలన్నా ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో పేద ప్రజలకు ఆర్థిక భారంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అమ్మహస్తం పథకంలో భాగంగా బియ్యం, గోధుమలు, కిరోసిన్, నూనె, చింతపండు, పప్పులు, గోధుమ పిండి, పంచదార, ఉప్పు, పసుపు, కారంపొడి లాంటి నిత్యావసర సరుకులను రేషన్ దుకాణాల ద్వారా కార్డుదారులకు పంపిణీ చేశారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం పాత విధానాలకు స్వస్తి పలికింది. కేవలం బియ్యాన్ని మాత్రమే సబ్సిడీపై సరఫరా చేస్తోంది. మిగిలిన నిత్యావసర సరుకులను బహిరంగ మార్కెట్‌లో కొనలేక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొంతమంది రేషన్ డీలర్లు ఇదే అదనుగా భావించి నాణ్యత లేని నిత్యావసర సరుకులను రేషన్‌లో దుకాణాల్లో పెట్టి అమాయక ప్రజలకు అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నరని ఆరోపణలు వస్తున్నాయి.

కనగల్ మండలంలో ఇలా...

కనగల్ మండల వ్యాప్తంగా 22 రేషన్ దుకాణాల్లో 12,989 రేషన్ కార్డులు ఉన్నాయి. గతంలో రేషన్ కార్డులు ఉన్న కుటుంబంలో ఐదుగురు వ్యక్తులు ఉంటే 4 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. ఆహార భద్రత అమల్లోకి వచ్చినప్పటి నుంచి కుటుంబంలో ఎంతమంది ఉంటే అంతమంది సభ్యులకు ఒక్కొక్కరికి 6 కిలో చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నారు. బియ్యం కోటా పెంచడం వల్ల సామాన్యులకు కొంత ఆర్థిక భారం తగ్గింది. కానీ రేషన్ దుకాణాల్లో నిత్యావసర సరుకుల పంపిణీ నిలిపివేయడం వల్ల పేద ప్రజలు ఆర్థిక భారంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీపై నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని కార్డుదారులు కోరుతున్నారు.

అన్ని సరుకులు అందించాలి



రేషన్ దుకాణాల్లో బియ్యం, అప్పుడప్పుడు పంచదార మాత్రమే ఇస్తున్నారు. మిగిలిన నిత్యావసర సరుకులు ఇవ్వడం లేదు. బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు అధికంగా ఉండడంతో పేద ప్రజలు వాటిని కొనలేకపోతున్నారు. రేషన్ దుకాణాల ద్వారా అన్ని సరుకులు అందించాలి.

– కారింగు యాదగిరి, రేషన్ కార్డుదారుడు, శాబ్దుల్లాపురం

నిత్యావసర సరుకులు కొనలేకపోతున్నాం



రేషన్ దుకాణాల్లో అన్ని రకాల సరుకులు అందించాలి. బియ్యం కోటా పెంచి నిత్యావసర సరుకులను తీసివేయడం సరికాదు. పేదలపై భారం కాకుండా చూడాలి. బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరుకులు కొనలేని పరిస్థితి ఉంది. మార్కెట్‌లో ధరలను ప్రభుత్వం నియంత్రించాలి.

– అద్దంకి రవీందర్, పగిడిమర్రి

అమ్మహస్తం పథకాన్ని పునరుద్ధరించాలి



గత కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో అమ్మహస్తం పథకంలో భాగంగా 9 రకాల సరుకులు పంపిణీ చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం అమ్మహస్తం పథకాన్ని నిర్వీర్యం చేసింది. అమ్మహస్తం పథకాన్ని వెంటనే పునరుద్ధరించి కార్డుదారులకు రేషన్ దుకాణాల్లో నిత్యావసర సరుకులు అందించాలి.

– నూనె సైదులు, బోయినపల్లి

అందరి సహకారంతో తెలంగాణ ఏర్పాటు



సెమినార్ హాల్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : ఉద్యోగులు, పెన్షనర్లు, విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజల సహకారంతో కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం సాధించారని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ భవనం మొదటి అంతస్తులో రూ.10 లక్షల ఎమ్మెల్యే నిధులతో ఆధునీకరించిన సెమినార్ హాల్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ తొలిదశ ఉద్యమంలో రిటైర్డ్ ఉద్యోగులు ముందుండి నడిచారన్నారు. కేసీఆర్ దత్తత తీసుకున్న నల్లగొండను రూ.1200 కోట్లు ఖర్చు చేసి సుందరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. పనులు పురోగతిలో ఉన్నాయని రెండేళ్లలో నల్లగొండ రూపురేఖలు మారుతాయన్నారు. అసోసియేషన్ భవన్ ఆధునీకరణ కోసం మరో రూ.15 లక్షలు తన నిధుల నుంచి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, వైస్ చైర్మన్ రమేష్, టీఎన్‌జీఓ అధ్యక్షుడు శ్రవన్‌కుమార్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి. వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు జిల్లా శ్రీశైలం, ప్రచార కార్యదర్శి శంకర్‌రెడ్డి, గాయం నారాయణరెడ్డి, రంగయ్య, మోహన్‌రావు, అమృతారెడ్డి, యుగేందర్‌రెడ్డి, ఆంజనేయులు, కృష్ణయ్య, లింగయ్య, హుస్సేన్, బుచ్చిరెడ్డి, రాజలింగం, మహేష్, లింగయ్య, సంతోష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, జగపతిరావు, రవీందర్‌రెడ్డి, రంగారెడ్డి, సత్యం, వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు వైద్యశిబిరం

నకిరేకల్ : నకిరేకల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సాయి మందిర కల్యాణ మండపంలో ఐకాన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు ఉప్పల వెంకటరమణ శుక్రవారం తెలిపారు. ఈ శిబిరంలో గుండె, మెదడు, నరాలు, వెన్నెముక, ఎముకలు, గ్యాస్ట్రో, గైనాకాలజీ, చర్మం, కంటి చూపు సమస్యలు ఉన్నవారికి ఉచితంగా పరీక్షలు చేస్తారని అన్నారు. ప్రజలు ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నిందితులను శిక్షించాలి

నల్లగొండ టౌన్ : మణిపూర్‌లో ఆదివాసి మహిళపై లైంగిక దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సుభాష్ విగ్రహం వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ప్రభావతి మాట్లాడుతూ అఘాయిత్యాలకు బాధ్యత వహిస్తూ ఆ రాష్ట్ర సీఎం రాజీనామా చేయాలన్నారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున, నర్సింహ, రవీందర్, శ్యామ్, పద్మ, అరుణ, మంజుల, శ్రీశైలం, నర్సిరెడ్డి, వెంకన్న, కిరణ్, మంజుల పాల్గొన్నారు.

అభివృద్ధి చేసేవారిని ఆశీర్వదించండి



15వ వార్డులో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్ : నియోజకవర్గ కేంద్రమైన నకిరేకల్‌ను మోడ్రన్ టౌన్‌గా తీర్చిదిద్దుతానని, పట్టణ ప్రజలు రాబోయే ఎన్నికల్లో అభివృద్ధి చేసే వారిని ఆశీర్వదించాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కోరారు. మున్సిపాలిటీలోని 15,16వ వార్డుల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఆయా వార్డుల్లో సీసీ రోడ్డు లేని చోట త్వరలోనే పనులు చేపడతామన్నారు. అనంతరం రజకుల కులస్తులకు కమ్యూనిటీ హాల్, మోడ్రన్ దోభీ ఘాట్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. ఎస్సీ బాలికల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, జాఫర్, యాసారపు శ్రీను, చెరుకు వీరయ్య, తదితరులు ఉన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలి



తిప్పర్తిలో మాట్లాడుతున్న ఆర్డీఓ ఎన్. రవి

రామగిరి(నల్లగొండ) : ఓటరు జాబితాలో తప్పులు లేకుండా జాగ్రత్త వహించాలని నల్లగొండ ఆర్డీఓ ఎన్.రవి అన్నారు. తిప్పర్తి ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం బీఎల్ఓ సూపర్‌వైజర్లు, బీఎల్ఓలకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజకీయ ఒత్తిడులకు తావులేకుండా పారదర్శకంగా ఓటర్ జాబితాను తయారు చేయాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సమగ్ర సమాచారంతో ఓటర్ జాబితా రూపొందించాల్సిన బాధ్యత బీఎల్ఓలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, ఎంఈఓ కె.అరుంధతి పాల్గొన్నారు.

జాబితా పారదర్శకంగా రూపొందించాలి

నకిరేకల్ : ఓటరు జాబితా పారదర్శకంగా రూపొందించాలని నకిరేకల్ తహసీల్దార్ ప్రసాద్ నాయక్ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం బీఎల్ఓలకు, సూపర్‌వైజర్లుకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం, వీవీప్యాట్ వినియోగంపై ఓటర్లను చైతన్యపరిచేందుకు సంచార ప్రదర్శన వాహనాన్ని ప్రారంభించారు. ఎన్నికల డీటీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించాలి

కేతేపల్లి : తప్పులు లేకుండా ఓటరు జాబితా రూపొందించాలని కేతేపల్లి తహసీల్దారు ఎస్.మధుసూదన్‌రెడ్డి బీఎల్ఓలకు సూచించారు. శుక్రవారం కేతేపల్లిలోని రైతు వేదికలో ఓటరు జాబితా రూపకల్పనపై ఆయా పాఠశాలల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, బీఎల్ఓలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల లాగిన్‌లో ఉన్న ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో ధృవీకరించుకుని పూర్తి చేయాలన్నారు. అర్హులైన ఓటర్లను ఓటరు జాబితాలో చేర్చి, మృతి చెందిన ఓటర్లు, డబుల్ ఓటర్లుగా నమోదైన వాటిని తొలగించాలన్నారు. ప్రతి ఓటరును ఆధార్ అనుసంధానం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ట్రైనర్ కుశలవరెడ్డి, బీఎల్వోలు పాల్గొన్నారు.

నాంపల్లి : గ్రామాల్లో బీఎల్ఓలు పర్యటించి 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా వివరాలు నమోదు చేయాలని తహసీల్దార్ ఆంజనేయులు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో బీఎల్ఓలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటు హక్కు ఉన్నవారు ఫామ్–6 ద్వారా బదిలీ చేసుకొవచ్చన్నారు. ఆర్ఐ దయాకర్‌రెడ్డి, మాస్టర్ ట్రైనర్స్ పందుల యాదయ్య, వెంకటేశ్వర్లు, బాలు, ప్రసాద్ పాల్గొన్నారు.

గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి



మునుగోడు : కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నార్కట్‌పల్లి : గురుకుల, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు అద్దె భవనాల్లో కాలం వెళ్లదీస్తున్నారని, ప్రభుత్వం స్పందించి గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని వైస్ ఎంపీపీ కల్లూరి యాదగిరి అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన సంఘర్షణ సైకిల్ యాత్ర రెండో రోజు నార్కట్‌పల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో యాత్రకు స్వాగతం పలికి మాట్లాడారు. సీపీఎం మండల కార్యదర్శి చెరుకు పెద్దులు, కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యుడు దండు రవి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు ఆకారపు నరేష్, కంభంపాటి శంకర్, ఆమనగంటి గోపీనాథ్, లక్ష్మణ్, రమేష్, జగన్, వీరన్న, తరుణ్, రవీందర్, సంపత్, రాహుల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యా రంగానికి నిధులు కేటాయించాలి

చిట్యాల : విద్యారంగానికి నిధులు కేటాయించి విద్యా సంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యా పరిరక్షణ కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ యాత్ర శుక్రవారం చిట్యాలకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులను వెంటనే అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, డివిజన్ కార్యదర్శి ఆమనగంటి గోపి, మండల అధ్యక్షుడు జిట్ట దినేష్, డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు పంది నరేష్, అవిశెట్టి కిరణ్, గోలి సాయి కిరణ్, కూరాకుల బాలు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రధాని మోదీ మౌనం వీడాలి

మునుగోడు : మణిపూర్‌లో జరిగిన ఘటనపై ప్రధాని మోదీ మౌనం వీడి నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, కమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సంఘర్షణ సైకిల్ యాత్ర శుక్రవారం మునుగోడుకు చేరుకుంది. ఈ సందర్భంగా మండలానికి చెందిన నాయకులు యాత్రకు స్వాగతం పలికారు. అనంతరం మణిపూర్ ఘటనపై ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ కస్తూరిబా పాఠశాల విద్యార్థినులతో కలిసి కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. లక్ష్మణ్, సైదా, రమేష్, గోపీనాథ్, రవీందర్, జగన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె



కేతేపల్లి : చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

నార్కట్‌పల్లి : సమస్యల పరిష్కారానికి గ్రామ పంచాయతీ సిబ్బంది మండల కేంద్రంలో చేస్తున్న సమ్మె శుక్రవారం 15వ రోజుకు చేరుకుంది. వర్షం వస్తున్నా కార్మికులు సమ్మె కొనసాగించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది జిల్లా జేఏసీ కన్వీనర్ కొండ వెంకటయ్య, నరకుడు బిందెల నరసింహ, ఎండీ షకిల్, శేఖర్, శివశంకర్, ఎల్లయ్య, చిక్కుల రమేష్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

చండూరు : సమ్మెలో భాగంగా గ్రామ పంచాయతీ కార్మికులు శుక్రవారం చండూరు మండల కేంద్రంలో భిక్షాటన చేశారు. కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బొట్టు శివకుమార్, గ్రామ పంచాయతీ వర్కర్ల మండల అధ్యక్ష కార్యదర్శులు ఏర్పుల సైదులు, నాంపల్లి శంకరయ్య, సురేష్‌నాయక్, ధోతి సుజాత, పుష్పలత, చారి, ధనమ్మ, నరసింహ, సైదులు, శంకరయ్య, యాదగిరి, భిక్షం అబ్బయ్య పాల్గొన్నారు.

మర్రిగూడ : మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె శుక్రవారం 16వ రోజుకు చేరుకుంది. వట్టిపల్లి హన్మంతు, ఊరిపక్క లింగయ్య, ముత్తయ్య, వెంకటయ్య, సునీత, రాములు, నర్సింహ, యాదయ్య పాల్గొన్నారు.

నకిరేకల్ : మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 16వ రోజుకు చేరింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చిన వెంకులు, వంటిపాక వెంకటేశ్వర్లు, లూర్దు మారయ్య, సాకుంట్ల నర్సింహ, పంచాయతీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీశైలం, మండల శాఖ అధ్యక్షుడు పల్స సైదులు కార్మికులు పాల్గొన్నారు.

చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన

కేతేపల్లి : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారం 16వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ కార్మికులు చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. యూనియన్ మండల అధ్యక్షుడు ఏడాకుల కోటయ్య, కోటయ్య, ఆశీర్వాదం, మాందాసు సైదులు, వి.లింగయ్య, పి.భద్రయ్య, కె.మహేష్, సైదులు, వెంకటాచారి, కృష్ణయ్య, బాలశౌరి, జానయ్య, దేవయ్య, బాలశౌరి, జ్యోతి, నాగమణి, శోభ, రమణ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూర్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 16వ రోజుకు చేరుకుంది. జీపీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కత్తుల రామలింగయ్య, ప్రధాన కార్యదర్శి పొన్న అంజయ్య, భాగ్యరేఖ, కాపుగంటి శ్రీను, చిలుముల వెంకన్న, కానుగు వెంకన్న, దోరెపల్లి భిక్షమమ్మ, చిలుముల రవి, ఏకుల యాదమ్మ, సబిత, సలోని, మచ్చ ఎల్లమ్మ, కత్తుల శ్రీను ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



నకిరేకల్ : మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్

నకిరేకల్ : పట్టణంలోని ప్రతి వీధిలో, ప్రతి ఇంటి ఎదుట విరివిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్ కోరారు. నకిరేకల్ మున్సిపాలిటీలోని 12వ వార్డులో శుక్రవారం ఇంటింటా మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి, 12వ వార్డు కౌన్సిలర్ బానోతు వెంకన్న, ముత్యాలమ్మ గుడి చైర్మన్ నడికుడి వెంకటేశ్వర్లు, హేమంత్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు మొక్కలు నాటాలి

మునుగోడు : గ్రామాల్లో లక్ష్యం మేరకు 9వ విడత హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటాలని డీఎల్‌పీఓ లక్ష్మీనారాయణ సిబ్బందికి సూచించారు. శుక్రవారం మునుగోడు గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించిన అనంతరం గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో నిర్మించిన ఇంకుడు గుంతలు, నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నీటి బొట్టు భూమిలో ఇంకేలా ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మించుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీఓ సుమలత, పంచాయతీ కార్యదర్శి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి

కట్టంగూర్ : నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఎంపీడీఓ పోరెళ్ల సునిత అన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని పామనగుండ్ల గ్రామంలో ఆమె మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం గ్రామంలోని జాతీయ రహదారి పక్కన ఉపాధి కూలీలు మొక్కలు నాటారు. సర్పంచ్ వడ్డె సైదిరెడ్డి, ఎంపీఓ అథర్ ఫర్వేజ్, ఏపీఓ కడియం రాంమోహన్ ఉన్నారు.

వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

నల్లగొండ టూటౌన్ : వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ కేవీ రమణాచారి సూచించారు. శుక్రవారం ఆయన మున్సిపల్ సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. పట్టణంలో 70 మంది సభ్యులతో కూడిన 4 రెస్క్యూ టీంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వన్‌టౌన్‌కు టూ టౌన్‌కు రెండు చొప్పున రెస్క్యూ టీంలను కేటాయించామన్నారు. అదేవిధంగా మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. ఈ కంట్రోల్ రూమ్‌లో పది మంది సభ్యులు 24 గంటలు విధులు నిర్వహిస్తారని అన్నారు. పట్టణ ప్రజలు అత్యవసర సమయాల్లో టోల్ ఫ్రీ నంబర్ 14420 లేదా 08682 220100 నంబర్‌కు ఫోన్ చేయాల్సిందిగా సూచించారు. అదేవిధంగా పానగల్ ఫ్లైఓవర్, లెప్రసీ కాలనీ, మహాలక్ష్మి అపార్ట్‌మెంట్, జంగాల కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, శ్రీనగర్ కాలనీ, పెద్ద బండ, అంధుల పాఠశాల ఏరియా, బృందావన్ కాలనీ, ద్వారకా నగర్, మీర్‌భాగ్ కాలనీ, పద్మానగర్ వంటి 11 ప్రాంతాలను లోతట్టు ప్రాంతాలుగా గుర్తించినట్లు తెలిపారు. అదేవిధంగా ఎస్పీఆర్ గార్డెన్, అమృత గార్డెన్, ఎమ్మెన్నార్ ఫంక్షన్ హాల్, స్టార్ ఫంక్షల్ హాల్, అంబేద్కర్ ఆడిటోరియం, అంబేద్కర్ భవన్, ఎస్ఆర్ గార్డెన్ లెప్రసీ కాలనీ చర్చి, వంటి వాటిని 8 వసతి కేంద్రాలుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అహ్మద్, ఏసీపీ నాగిరెడ్డి, డీఈలు, ఏఈలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ప్రదర్శన ప్రారంభం



నల్లగొండ ఆర్డీఓ కార్యాలయంలో ఈవీఎంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నల్లగొండ : నల్లగొండ నియోజకవర్గానికి సంబంధించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ప్రదర్శన కేంద్రాన్ని శుక్రవారం నల్లగొండ ఆర్డీఓ రవి తన కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే వారంతా ఓటింగ్ యంత్రాల్లో ఓటు వేసి చెక్ చేసుకోవాలని కోరారు. సిబ్బంది కూడా ఓటింగ్ యంత్రాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు.

చండూరు : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మొబైల్ ఈవీఎం ప్రదర్శన వాహనాన్ని తహసీల్దారు అర్చనా రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ తహసీల్దారు కార్యాలయంలో 60 రోజుల పాటు ఈవీఎం ఉంచి సందర్శకులకు ఈవీఎంలో ఓటు ఎలా వేయాలో అవగాహన కల్పిస్తామని తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలో ఆరు మండలాల్లో 199 ప్రదేశాల్లో రెండు నెలల పాటు ఓటర్లకు అవగాహన కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు దీపక్, ఆర్ఐలు, సిబ్బంది, ఓటర్లు పాల్గొన్నారు.

బురద నీటిలో వరినాట్లు వేసి నిరసన



బురద నీటిలో వరినాట్లు వేస్తున్న మహిళలు

కట్టంగూర్ : వర్షాలకు మండలంలోని అయిటిపాముల గ్రామంలో 2, 10వ వార్డులు సీసీ రోడ్లు లేక బురదమయంగా మారాయి. శుక్రవారం బీఎస్పీ నాయకులు ఆయా వార్డులను పరిశీలించి మహిళలతో కలిసి బురద నీటిలో వరినాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఎస్పీ పార్టీ జిల్లా కోశాధికారి కొవ్వూరి రంజిత్ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వార్డుల్లో సీసీ రోడ్లు నిర్మించాలని కోరారు.

నిధులు కేటాయించాలి

మర్రిగూడ : మండల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను శుక్రవారం మాజీ ఎంపీపీ అనంతరాజుగౌడ్ ప్రగతిభవన్‌లో కలిసి విన్నవించారు. ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్‌తో కలిసి మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

విద్యుదాఘాతానికి కోడె మృతి

శాలిగౌరారం : మేత మేసుకుంటూ వెళ్లిన కోడె విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన సంఘటన మండలంలోని జాలోనిగూడెం గ్రామంలో శుక్రవారం జరిగింది. వివరాలు.. జాలోనిగూడెం గ్రామానికి చెందిన జమ్ము అశోక్ రోజువారీగా తన పశువులను మేపేందుకు వ్యవసాయ పొలం వద్దకు తోలుకుపోయాడు. ఒక కోడె మేత మేసుకుంటూ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది.

దరఖాస్తుల స్వీకరణ

చండూరు : గట్టుప్పల్ మండల పరిధిలోని తేరట్‌పల్లి గ్రామంలో ఇళ్ల స్థలాల పంపిణీకి దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నుంచి స్వీకరిస్తున్నారు. ఆ గ్రామంలో 25 ఏళ్ల క్రితం 7 ఎకరాల 11 గుంటల భూమిని 156 మందికి 150 గజాలు చొప్పున పంపిణీ చేశారు. ఆనాడు విద్యుత్, నీళ్ల సౌకర్యం లేకపోవడంతో ఇళ్ల నిర్మాణం చేసుకోలేదు. దీంతో కొన్ని కుటుంబాల పట్టాలను రద్దు చేశారు. ఇటీవల అధికారులు ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులను ఎంపిక చేసి కుటుంబానికి 75 గజాల చొప్పున 250 మందికి పంపిణీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. శనివారం వరకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ లావణ్య తెలిపారు.

ముదిరాజ్‌లకు అధిక సీట్లు కేటాయించాలి

మునుగోడు : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున ముదిరాజ్‌లకు అధికంగా అసెంబ్లీ స్థానాలను ఇచ్చేలా సీఎం కేసీఆర్‌కు విన్నవించాలని కోరుతూ శుక్రవారం మునుగోడు మండలానికి చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్‌ని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నారబోయిన రవిముదిరాజ్, నీలం మధు, పట్నం మాణిక్యం, సత్యనారాయణ, గోపి, పులిమామిడి రాజు, దినేష్, సందీప్, గుండ్లపల్లి శ్రీను పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

చిట్యాల : తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే వారి సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్న చిట్యాల తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులను శుక్రవారం యువ సంఘర్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనుమోజు రామాచారి, మండల కోఆర్డినేటర్ తుంగతుర్తి వెంకటేశం, డిప్యూటీ తహసీల్దార్ రాగ్యా నాయక్, సీనియర్ అసిస్టెంట్ రేణుక పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కనగల్ : బుడుమర్లపల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ అంతిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.